నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 28 అక్టోబర్ 2024 | YADADRI BHUVANAGIRI

30న నల్లగొండలో సదర్

నల్లగొండ రూరల్, అక్టోబర్ 27: ఈ నెల 30న సాయంత్రం 5 గంటలకు నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో జరిగే సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మద్ది శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళి సందర్భంగా ప్రతి సంవత్సరం యాదవులు సదర్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాడి పంటలు బాగా పండాలని, గోవులను పూజించి, దున్న పోతులను అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి విన్యాసాలు నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌కే పరితమైన సదర్ ఉత్సవాన్ని కొన్నేండ్లుగా నల్లగొండ జిల్లా కేంద్రంలో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాదవులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యాదవ సంఘ జిల్లా నాయకులు పిల్లి రామరాజు యాదవ్, ఎల్పీ యాదవ్, అల్లి సుభాష్, తరాల పరమేశ్, జానయ్య, చందు వంశీ, నాగారాజు , కోటేశ్, సత్యనారయణ, శివకుమార్, మల్లేశ్, సురేశ్, చంద్రయ్య, వెంకన్న, పవన్, శంకర్ పాల్గొన్నారు.

కాంగీల అత్యుత్సాహం.. ఖాకీల కర్కశం

- కాంగ్రెస్ శవ రాజకీయం

ఇరువురి మధ్య నలిగిన నిరుపేద కుటుంబం

- యువకుడి ప్రాణం తీసిన కాంగ్రెస్ సభా వేదిక
- మూసీ బ్రిడ్జిపై స్టేజీ వేయడం, లైట్లు లేకపోవడంతో ప్రమాదం
- సభ నేపథ్యంలో రోజంతా పోస్ట్‌మార్టం రూమ్‌లోనే మృతదేహం
- కొడుకు మృతదేహాన్ని చూపించక పోవడంతో తల్లడిల్లిన తల్లి హృదయం
- నకిరేకల్ ఏరియా దవాఖాన ఎదుట బాధిత కుటుంబం ధర్నా
- 24గంటలు దాటినా పోస్ట్‌మార్టం చెయ్యని అమానవీయం

నకిరేకల్/శాలిగౌరారం, అక్టోబర్ 27 : కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహం ఒక యువకుడి ప్రాణాలను బలి తీసుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మూసీ ప్రక్షాళనకు మద్దతు కోరుతూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆధ్వర్యంలో ఆదివారం రైతు సమ్మేళనం ఏర్పాటుచేశారు. అందు

తూర్పాటి చరణ్ (ఫైల్)

కోసం శాలిగౌరారం మండలంలోని గురజాల-మనాయికుంట వద్ద మూసీ బ్రిడ్జిపై రోడ్డుకు సగం వరకూ కాంగ్రెస్ నాయకులు శనివారం రాత్రి సభా వేదికను కట్టారు. ఎక్కడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. బ్రిడ్జిపై కనీసం లైట్లు కూడా లేవు. రాత్రి 8గంటల సమయంలో సూర్యాపేట జిల్లా కుడకుడకు చెందిన తూర్పాటి చరణ్(17) చరణ్ తల్లిదండ్రుల మెడిసిన్ కోసం బైక్‌పై మనాయికుంట గ్రామానికి వెళ్తూ మూసీ బ్రిడ్జిపై స్టేజీని కనిపించకపోవడంతో స్టేజీకి కట్టిన ఇనుప రాడ్లను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారితే సభ జరుగాల్సిన ప్రదేశంలో రక్తపు మరకలు పేరుకుపోవడంతో భయపడిన కాంగ్రెస్ నాయకులు రాత్రికి రాత్రే వేదికను తొలగించారు. శాలిగౌరారం పోలీసులు యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఏరియా దవాఖానకు తరలించారు.

నకిరేకల్ ప్రభుత్వ దవాఖాన ఎదుట కుమారుడి మృతదేహాన్ని చూపించాలని ధర్నాకు దిగిన చరణ్ తల్లి, బంధువులు

దవాఖాన ఎదుట రోజంతా నిరీక్షణ

చరణ్ మృతదేహాన్ని మార్చురీలో ఉంచి తాళం వేసిన పోలీసులు ఆపై బాధిత కుటుంబం ఆందోళనకు దిగకుండా కాంగ్రెస్ నేతల తరపున బేరసారాల బాధ్యత తీసుకున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలు దాటినా పోస్ట్‌మార్టం చేయకపోవడతో బాధిత కుటుంబం తరపున బంధువులు నకిరేకల్ ప్రభుత్వాసుపత్రి ఎదుట చరణ్ బంధువులు ధర్నాకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు, వారికి మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. సభ సాఫీగా సాగాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ నేతలు నష్టపరిహారం ఇస్తామంటూ శవ రాజకీయం చేశారు. పరిహారం ఇప్పిస్తామంటూ పోలీసులు చరణ్ తండ్రి సైదులు, మరో ముగ్గురు పెద్ద మనుషులను శాలిగౌరారం స్టేషన్‌కు తీసుకువెళ్లారని ఆమె తల్లి వాపోయారు. ఎంతకీ పోస్ట్‌మార్టం చేయకపోవడతో ఒక దశతో చరణ్ బంధువులు మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు మార్చరీ గేటు ఎక్కేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. 'మీ వాళ్లతో మాట్లాడుతున్నారు. న్యాయం చేస్తాం. ఓపిక పట్టండి' అంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేయగా, మరోమారు వాగ్వాదం జరిగింది. 'రోడ్డు మధ్యలో సభ ఎవరు పెట్టమన్నారు. లైట్లు ఎందుకు వేయలేదు. లైట్లు వేసి ఉంటే చరణ్ బతికుండేవాడు. మార్చురీకి తాళం ఎందుకు వేశారు. 24గంటలైనా పోస్ట్‌మార్టం ఎందుకు చేయరు' అని ప్రశ్నించగా.. సమాధానం చెప్పలేక పోలీసులు సతమతమయ్యారు. కాంగ్రెస్ మీటింగ్ దగ్గరికి చరణ్ మృతదేహాన్ని తీసుకువెళ్లి ఆందోళన చేస్తామనే పోస్ట్‌మార్టం ఆపేశారని బాధిత కుటుంబం వాపోతున్నది. కాంగ్రెస్ పార్టీ నాయకులు చరణ్ కుటుంబ సభ్యులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తుండగా, ఆదివారం అర్ధరాత్రి వరకు కూడా మృతదేహానికి పోస్ట్‌మార్టం జరుగలేదు. ఈ విషయమై ఆస్పత్రి సిబ్బంది, పోలీసులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డిని వివరణ కోరగా చరణ్ మృతదేహానికి ఆదివారం రాత్రి గానీ సోమవారం ఉదయం గానీ పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగిస్తామన్నారు.

కాంగ్రెస్ నేతల అత్యుత్సాహంతో చరణ్ ప్రాణం వదలగా.. ఆ తర్వాత పోలీసులు మరింత కర్కశంగా వ్యవహరించారని బాధిత కుటుంబం బోరున విలపిస్తున్నది. ఆదివారం కాంగ్రెస్ సభకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం హాజరయ్యారు. చెట్టంత బిడ్డను కోల్పోయి తీవ్ర ఆవేదనలో ఉన్న బాధిత కుటుంబం సభ వద్దకు వచ్చి ఎక్కడ నిరసన తెలుపుతుందోనని భయపడిన కాంగ్రెస్ నేతలు పోలీసులను అడ్డం పెట్టుకుని తమను తీవ్ర ఇబ్బందులు పాలుజేశారని చరణ్ బంధువులు వాపోయారు. శనివారం రాత్రి చరణ్ మృతదేహాన్ని నకిరేకల్ ఏరియా హాస్పిటల్‌లోని మార్చురీలో పెట్టి తాళం వేసిన ఆదివారం రాత్రి వరకూ బాధిత కుటుంబానికి చూపించకపోవడం, పోస్టుమార్టం చేయించి అప్పగించకపోవడం తీవ్ర అవమానీయంగా మిగిలింది.

ఎమ్మెల్యేనే నా కొడుకును చంపించిండు

- చరణ్ తల్లి గంగమ్మ ఆవేదన

'ఎమ్మెల్యేనే నా కొడుకును చంపించిండు. లైట్లు వేసుంటే బతికుండేటోడు. మీటింగ్ ఉన్నదని పోస్టుమార్టమ్ చెయ్యటేరు. నా కొడుకును సూడక 24 గంటలైంది. న్యాయం చేస్తమని నా మొగుణ్ని ముగ్గురు పెద్దమనుషులను తీసుకపోయిండ్రు. ఇప్పటి వరకు జాడలేదు. మీకు దండం పెడతా. నా కొడకును నాకు చూపించండి.' అంటూ చరణ్ తల్లి గంగమ్మ బోరుబోరున విలపించింది. శనివారం రాత్రి చనిపోయిన కొడుకును ఆదివారం రాత్రి అయినా చూపించకపోవడంతో ఆ తల్లి ఎంతో తల్లడిల్లింది.

కుమారుడి కోసం రోధిస్తున్న చరణ్ తల్లి గంగమ్మ

సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి

గ్రామీణ రోడ్లను బడా బాబులకు కట్టబెట్టే కుట్ర

- జనం గుండెల్లో పొంగులేటి మొదటి బాంబు
- చంద్రబాబు విధానాలే రేవంత్ పాటిస్తున్నారు
- రోడ్లతోపాటు విద్యుత్‌ను కూడా కార్పొరేట్లకు ఇచ్చే కుట్ర
- అడ్డగోలుగా కట్టబెడుతామంటే అడుగడుగునా అడ్డుకుంటాం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, అక్టోబర్ 27 (నమస్తేతెలంగాణ) : గ్రామీణ ప్రాంత రోడ్లను బడా బాబులకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. కొరియా నుంచి వచ్చిన మంత్రి పొంగులేటి అన్నట్టుగానే మొదటి బాంబును గ్రామీణ ప్రజల గుండెల్లో పేల్చారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా చంద్రబాబు విధానాలే పాటిస్తున్నారు తప్ప అభివృద్ధి గురించి ఆలోచన చేయడం లేదని విమర్శించారు. ఆదివారం సూర్యాపేటలోని క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలోనే అన్ని ప్రాంతాలకు రోడ్లు, విద్యుత్ సౌకర్యం అందిందన్నారు. 60 ఏండ్ల నిర్లక్ష్యాన్ని ఎండగట్టి కేవలం పదేండ్లలో అద్భుత ప్రగతి సాధించిన ఘనత బీఆర్ఎస్ పార్టీది అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఓట్లతో గెలిచి వారిపై బాంబులు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ మరోమారు తన విషబుద్ధిని ప్రదర్శించిందన్నారు. క్యాబినెట్ నిర్ణయం ప్రకారం గ్రామీణ ప్రాంత రోడ్లను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు కట్టబెడితే ప్రజలపై మరింత భారం మోపినట్లు అవుతుందని, ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని తెలిపారు. రాష్ట్రాన్ని దోచి బడా బాబులకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను అడుగడుగునా ఎండగడుతామన్నారు. ప్రజల బతుకుల్లో చీకట్లు నింపే దుర్మార్గపు ఆలోచన చేస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల నుంచి పట్టణాలకు, పట్టణాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి అద్భుతంగా రోడ్లు వేయడాన్ని గుర్తు చేశారు. ఇప్పటికే మూసీ దోపిడీ కుట్ర జరిగిందని, ఇప్పుడు రోడ్లపై పడ్డారని, ఆ తర్వాత విద్యుత్‌ను కూడా కార్పొరేట్ల చేతుల్లో పెడతారని దుయ్యబట్టారు. రాష్ట్రం పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్తుందని, మున్ముందు ప్రపంచ బ్యాంక్‌కు అప్పగిస్తారేమనని ఎద్దేవా చేశారు. ఇండ్ల నుంచి బయటకు వెళ్తే టాక్స్ కట్టాల్సిన దుస్థితిని తీసుకువస్తున్నదని, రోడ్లను ఏ ప్రాతిపదికన కేటాయిస్తారో పూర్తి వివరాలు వెల్లడించాలని నిలదీశారు. ఇదే విధానం కొనసాగితే ఒక్కో జిల్లా ఒక కాంట్రాక్టర్ చేతుల్లోకి వెళ్తుందని, దీనిని బీఆర్ఎస్ పార్టీ అడ్డుకుంటుందని, ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టంచ చేశారు.

జీవన సత్యాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య

సాహిత్యం సమాజ చైతన్యానికి దోహదం

- డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట, అక్టోబర్ 27 : సాహిత్యం సమాజ చైతన్యానికి దోహద పడుతుందని పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో గల ఆచార్య కూరెళ్ల గ్రంథాలయంలో వేదాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీర బ్రహ్మం రాసిన సజీవ సత్యాలు శతకాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. శతకంలోని పద్యాలు అందరికీ అర్థమయ్యేలా, నీతులు, తల్లితండ్రుల పట్ల పిల్లల బాధ్యత, సమాజంలో పౌరుల విధులను గుర్తుచేసే విధంగా ఉన్నాయని ప్రశంసించారు. శతక పద్యాలు పాఠకులకు ప్రేరణ కలిగిస్తాయన్నారు. కవి ఎర్రోజు వెంకటేశ్వర్లు పుస్తకాన్ని పరిచయం చేశారు. వేదాస్ అసోసియేషన్ అధ్యక్షుడు అలుగోజు కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో టి. వేణుగోపాలచారి, కె.లక్ష్మయ్య, భద్రయ్య, కె.జగన్నాథం, ముత్తోజు మధు, బేతోజు సత్యనారయణ, బి.గోవర్ధనాచారి, కూరెళ్ల నర్మద, తాటిపాముల స్వామి, భిక్షమాచారి, శ్వేత, కనకాచారి, హారిక పాల్గొన్నారు.

భగ్గుమంటున్న బెటాలియన్

- ఆగని కానిస్టేబుళ్ల ఆందోళన
- పిల్లాపాపలతో కలిసి నిరసన తెలిపిన కుటుంబాలు
- మరో ఐదుగురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

నల్లగొండ 12వ బెటాలియన్‌లో నిరసన తెలుపుతున్న స్పెషల్ పోలీసులు

నీలగిరి, అక్టోబర్ 27 : ఒకే రాష్ట్రం.. ఒకే పోలీస్ నివాదంతో ప్రారంభమైన బెటాలియన్ కానిస్టేబుళ్ల పోరాటం రోజురోజుకూ ఉధృతం అవుతున్నది. సోమవారం నల్లగొండ శివారులోని అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో మొదలైన పోరాటం రాష్ట్రమంతటా విస్తరించింది. అదే రోజు కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేపై రాస్తారోకోకు దిగగా.. అందుకు బాధ్యులుగా ఆరుగురు కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దాంతో ఆందోళన మరింత తీవ్రతరమై సచివాలయం ముట్టడి వరకూ వెళ్లిన సంగతి తెలిసిందే. కానిస్టేబుళ్ల పోరాటంతో దిగివచ్చిన ప్రభుత్వం కొన్ని వెసులుబాట్లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆరుగురిపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. కాగా, శనివారం శాంతియుతంగా ధర్నా చేసిన మరో ఐదుగురి కానిస్టేబుళ్లు ఎన్.శ్రీనివాస్ యాదవ్, ఆర్.హనుమానాయక్, బి.వెంకటేశ్వర్లు, ఏ.రాములు, ఎస్‌కే షఫీని సస్పెండ్ చేయడంతో అదివారం మళ్లీ ఆందోళన చేపట్టారు. ఆదివారం సెలవు రోజు అవడంతో కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు ఇంటిల్లిపాది రోడ్డెక్కి నిరసన తెలిపారు. పిల్లలు సైతం బెటాలియన్‌లోని అన్ని రహదారుల్లో చిన్నారులు తిరుగుతూ నినాదాలు ఇచ్చారు. బెటాలియన్‌లో ఆందోళన జరుగుతున్న నేపథ్యంలో రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో చేస్తారనే ముందు జాగ్రత్తతో సివిల్ పోలీసులు బెటాలియన్ ఎదుట భారీగా మోహరించారు.

బెటాలియన్ పోలీసుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ, అక్టోబర్ 27: బెటాలియన్ పోలీసులు కొద్ది రోజులుగా తమ కుటుంబాలతో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వారి ఒకే రాష్ట్రం ఓకే పోలీస్ డిమాండ్‌ను ఆమోదించాలని కోరారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పోలీసులే ఆందోళన చేసే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు. పిల్లలతో కుటుంబ సభ్యులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా సర్కారులో స్పందన లేకపోవడంతో బాధాకరమని పేర్కొన్నారు. అన్నెపర్తిలోని 12వ బెటాలియన్‌లో పోలీసులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తుంటే పరామర్శించడానికి వెళ్లిన తనను కనీసం లోపలికి అనమతించకపోగా, పోలీసులు దౌర్జన్యంగా అరెస్ట్ చేయడంపై మండిపడ్డారు. పోలీస్ ఉన్నతాధికారులు కిందిస్థాయి పోలీసుల సమస్యలను పరిష్కరించాలే గానీ హేళన చేసి మాట్లాడడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడంతో పాటు సస్పెండ్ చేసిన పోలీసులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వారికి పూర్తి అండగా ఉండి పోరాటం చేస్తామని ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

తెల్లబంగారం దొంగలు

కాంటాపై బస్తా పెడితే ఏడు నుంచి పది కిలోల పత్తి మాయం

- గ్రామాల్లో దళారులంతా సీసీఐ ఏజెంట్లే?
- కలెక్టర్ మీటింగ్ పెట్టి పది రోజులు గడిచినా తెరుచుకోని సీసీఐ కేంద్రాలు

రైతులు పండిస్తున్న తెల్లబంగారం చేతికి వస్తుండడంతో మోసాలతో కొనుగోలు చేసే దోపిడీ దొంగలు తయారవుతున్నారు. 25 కిలోలు గానీ, 50 కిలోలు గానీ.. ఒక్కసారి కాంటాపై బస్తా పెడితే ఏడు నుంచి పది కిలోల పత్తిని మాయ చేస్తున్న ఘనులు వాళ్లు. సాధారణంగా కాంటా వేసే సమయంలో బాట్లు, కాంటావైపే రైతులు చూస్తారు. ఇక్కడ కాంటాలో తేడా ఉండదు, బాట్లలో మోసం ఉండదు. దడువాయి హ్యాండ్ మ్యాజిక్‌తో మాయ చేసి రైతులకు కుచ్చుటోపీ పెడతారు. సూర్యాపేట జిల్లావ్యాప్తంగా ఇప్పుడిప్పుడే పత్తి పంట చేతికి వస్తుండగా పది రోజుల క్రితమే కలెక్టర్ సమావేశం పెట్టి పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా ఇప్పటికీ తెరుచుకోలేదు.

– సూర్యాపేట, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ)

ఈ నెల 21న చివ్వెంల మండలం గుంజలూరులో పత్తి తూకాల్లో దళారి మోసానికి పాల్పడడంతో లోడ్‌ను కిందికి దింపి ఖాళీ డీసీఎంను వెనక్కి పంపిన రైతులు

ఇంటిల్లిపాది ఆరుగాలం కష్టపడి పంటను తీసే రైతులకు తీరా మార్కెట్‌కు చేరుకునే సరికి మోసం జరుగుతున్నది. జిల్లాలో పంట దిగుబడి ప్రారంభం కాగా, అప్పుడే దోపిడీకి తెరలేచింది. సూర్యాపేట జిల్లావ్యాప్తంగా ఆంధ్రాకు చెందిన ఒకరిద్దరు స్థానికంగా కొంతమంది వ్యాపారులతో లింకులు ఏర్పాటు చేసుకుని గ్రామాల్లో ఏజెంట్లను తయారు చేసుకున్నారు. వారి ద్వారా రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 ఉండగా, రూ.6,500 నుంచి 7వేలకు ఇంటి దగ్గరే కొంటామని చెప్తూ మోసాలకు పాల్పడుతున్నారు. రవాణా, ఇతరత్రా ఖర్చులు లేకుండా మంచి ధర ఇస్తున్నామని నమ్మబలికి రంగంలోకి దిగుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా, అసలు మోసం అంతా కాంటాలు వేసేప్పుడే జరుగుతున్నది. కాంటా వేసే సమయంలో ఒక బస్తా 25 కిలోల నుంచి 50 కిలోల వరకు ఎంత ఉన్నా ప్రతి బస్తాకు 7 నుంచి 10 కిలోల పత్తిని మాయ చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్కసారి బస్తా కాంటా ఎక్కించి దింపితే రూ.530 నుంచి 750 వరకు రైతులను దోచుకుంటున్నారు. ఇలా కాంటాలో మోసం చేసేందుకు హ్యాండ్ మ్యాజిక్‌పై పట్టున్న దడువాయిలను ఎంచుకోవడం, లేదంటే తర్ఫీదు ఇచ్చి నియమించుకోవడం జరుగుతున్నది. అత్యంత వేగంగా కాంటాపై బస్తా పెట్టి అదే వేగంతో బస్తా ఉన్న వైపు ముందుకు నెట్టి ఇన్ని కేజీలు అయ్యాయని వెంటనే బస్తాను తొలగించి లారీల్లోకి ఎక్కించడం చేస్తున్నారు. చివ్వెంల మండలం గుంజలూరులో గత సోమవారం ఓ దళారీ ఇలాంటి మోసానికి పాల్పడగా, రైతులకు అనుమానం వచ్చి లోడ్ చేసిన పత్తి బస్తాలను కిందికి దింపి తిరిగి కాంటాలు వేయించడంతో మోసం బయటపడింది. ఒక్కో బస్తా ముందుకు, ఆ తర్వాతకు 7కిలోల వరకు తేడా రావడంతో రైతులు అతడికి పత్తి అమ్మకుండా వెనక్కి పంపించేశారు. ప్రభుత్వం గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లు చేపడితే ఇలాంటి మోసాలకు తావు ఉండదని ఇక్కడి రైతులు వాపోతున్నారు.

కొర్రీలే సగం కారణం

రైతులు పండించిన పత్తి కొనుగోళ్లలో దోపిడీలో గ్రామాల్లో దళారులతో పాటు సీసీఐ కొనుగోలుదారుల పాత్ర కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులు తమ పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకు వెళ్తే 'మాయిశ్చర్ ఉంది. పత్తి రంగు మారింది. ఎకరాకు 5 లేదా 6 కింటాల వరకే కొనుగోలు చేస్తాం. పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు కావాలి' అంటూ నానా కొర్రీలు పెట్టి తీరా తక్కువ ధరకే కొనుగోలు చేస్తుంటారని రైతులు వాపోతున్నారు. అదే దళారులు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్తే కొర్రీలు పెట్టకుండా మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తారనే చెప్పుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు గ్రామాల్లోనే దళారులకు పత్తి విక్రయిస్తున్నారు. ఇలా సీసీఐ, దళారులు కుమ్మక్కై ఒక్కో సీజన్‌లో నాలుగు నుంచి ఐదు కోట్ల రూపాయల దోపిడీ చేసి వారు తీసుకొని, సహకరించే అధికారులకు ఇంత పంచుతారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే గ్రామాల్లో దళారులు కొనుగోలు ప్రారంభించగా, కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించినా ఇప్పటికీ అతీగతీ లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో దళారుల బెడదను అరికట్టడంతో పాటు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి అధికారులు సరైన పర్యవేక్షిస్తూ రైతులకు మద్దతు ధర ఇప్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చదువుల తల్లికి ఆర్థిక కష్టాలు

- మొదటి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీటు సాధించిన సానియా
- ఖర్చులకు డబ్బు లేక కుమిలిపోతున్న తల్లిదండ్రులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు

తల్లి దండ్రులతో సానియా

రామన్నపేట, అక్టోబర్ 27 : నీట్‌లో ఉత్తమ ర్యాంకుతో ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థిని చదువుకు ఆర్థిక అవసరాలు ఆటంకాలుగా మారాయి. చిన్నతనం నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకున్న ఆమెకు ఇప్పుడు హాస్టల్ ఫీజు, మెస్ చార్జీలు వంటి ఖర్చులు తలకు మించిన భారంగా మారాయి. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె తల్లిదండ్రులు ట్యూషన్ ఫీజు వరకు చెల్లించగలిగినా మిగతా ఖర్చులకు ఆర్థిక పరిస్థితి సహకరించక కుమిలిపోతూ.. దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఎండీ సానియా మొదటి ప్రయత్నంలోనే నీట్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకుని మెడిసిన్‌లో సీటు సంపాదించింది. ఆమె తండ్రి ఎండీ జహంగీర్ ఇంటి వద్దే కిరాణా దుకాణం నడిపిస్తుండగా, తల్లి నర్సింగ్‌సులైనా టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారి కుమార్తెలు, ఒక కుమారుడు కాగా, సానియా పెద్దకూతురు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి వరకు చదివి ఎంట్రెన్స్ ఎగ్జామ్ రాసి జనంపల్లి గురుకుల పాఠశాలలో సీటు సాధించి అక్కడే 10వ తరగతి పూర్తి చేసింది.

ఇంటర్మీడియట్ గౌలిదొడ్డి కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో చదివింది. ఈ ఏడాది జరిగిన నీట్‌కు హాజరై మొదటి ప్రయత్నంలోనే ఉత్తమ ర్యాంకు సాధించింది. ఇటీవల నిర్వహించిన కౌన్సిలింగ్‌లో భద్రాద్రి కొత్తగూడెం మెడికల్ కళాశాలలో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటును సాధించింది. తల్లి తండ్రులు అతికష్టం మీద 30వేల రూపాయల ట్యూషన్ ఫీజును చెల్లించగలిగారు. హాస్టల్, మెస్ ఫీజు, స్టడీ మెటీరియల్ వంటివి ఖర్చులకు ఆర్థిక స్థోమత సహకరించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాతలు ముందుకువచ్చి తమ కూతురు చదువుకు సాయం కోరుతున్నారు. దాతలు జహంగీర్ ఫోన్ నెంబర్ 95539 92652కు కాల్ ఆర్థిక సాయం చేయవచ్చు.

శాఖాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకుడు పగిళ్ల సైదులు

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నిడమనూరు, అక్టోబర్ 27 : తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమ కారుల ఐక్యవేదిక నియోజకవర్గ నాయకుడు పగిళ్ల సైదులు కోరారు. మండలంలోని శాఖాపురంలో ఆదివారం జరిగిన ఐక్యవేదిక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యమకారుల పోరాటాలు, త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీని నియమించడంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటుకు తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఉద్యమకారులకు 10 శాతం వాటా కేటాయించాలని కోరారు. సమావేశంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు అన్నెబోయిన కొండలు, కొండేటి కృష్ణ, ఉన్నం ఈశ్వర్‌ప్రసాద్, ఆంగోతు శ్రీను, కిషన్, నల్లగంతుల గిరి, మాతంగి గోవిందు, పెదమాము మధు, రాము, ఉస్మాన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.